


ఆరోజు తపాల్ తెచ్చి స్టాంపువేసి, ట్రేలో పెట్టి వెళ్ళిపోయాడు బాలయ్య.

తెలుగు లెక్చరర్ కమల ఎదురుగా కుర్చీలో ఉన్నారు. ఏవో పుస్తకాలు మా లైబ్రరీలో నుంచి తీసి ఇవ్వమని అడగడానికి వచ్చారావిడ. బాలయ్య తెచ్చిన పుత్తరాలు చూస్తున్నాను నేను.

"మీకు వీడెక్కడ దొరికాడు?" — అంది ఆవిడ. బాలయ్య వెళ్ళిన వేపు చూస్తూ.

"ఏం?"— అన్నాను నేను యథాలాపంగా బాలయ్య ఇక్కడ చేరి నెల రోజులవుతోంది. నేను గమనించినంత వరకు బాలయ్య పనిలో నాకు లోపం కనిపించలేదు.

"మీకు పని చేస్తున్నాడా?"— అని మరొక ప్రశ్న జోడించారు. మొదటి దానికి.

నేను జవాబు ఇవ్వలేదు. కొందరు మొదట్లో పని చేస్తారు. తరవాత బద్ధకిస్తారు. కొందరు ఒకరికి పలుకుతారు. మరొకరి మీద తిరగబడతారు.

మళ్ళీ ఆవిడే అన్నారు. "వీడికి 12 ఏళ్ల వచ్చేవరకు మా యింట్లోనే ఉండేవాడు." అని.

"మరి ఇప్పుడెందుకు లేడు?" — ఏదో ఒకటి అడగాలన్నట్టుగా అడిగాను.

"పొగరెక్కువై తే మేమే పొమ్మన్నాం."

బాలయ్య మళ్ళీ ఏవో కాగితాలు తెచ్చాడు. రెండు కప్పులు కాఫీ తెమ్మని బాలయ్యకి డబ్బ

ర్చిచి. కమలని ట్రాక్ రూంకి తీసుకుని వెళ్ళాను. కమల పుస్తకాలు వెతుక్కోడంకన్న. బాలయ్యని గురించి వివరించడంలో ఎక్కువ ఉత్సాహం చూపించింది. బాలయ్య వాళ్ళింటో చేరినప్పుడు వాడికి 8 ఏళ్ళు. చాలా చురుగ్గా వుండేవాడు అప్పట్లో. నోట్లో మాట నోట్లో ఉండగానే చేతిలో పని అందుకునే వాడు. నాలుగేళ్ళతర్వాత వాడిలో మార్పు కనిపించింది. పని దొంగ అయాడు. పొద్దున్నే ఏడున్నర అయేసరికి ఎటో పోయేవాడు. పదకొండువరకూ — కనిపిస్తూ, మాయ మవుతూ, పనిచేసినట్టు కాకుండా, చేయనట్టూ కాకుండా తప్పించుకు తిరిగేవాడు. మళ్ళీ మధ్యాహ్నం నాలుగునుంచి ఎనిమిది వరకూ అంతే. ఎక్కడికి వెళ్లేవంటే చెప్పేడు. పనివేళ ఇంట్లో లేకపోతే ఎలాగ అంటే మాట్లాడడు. మర్నాడు ఇంట్లో ఉండడు."

"ఆటలాడుకునే వయసేకాని సంసారంచేసే వయసు కాదు కదా - చల్లని వేళల్లో ఏ బిళ్ళా కర్రో ఆడుకుని, తీరినప్పుడు మీ పని చేసుకునే వాడు కాబోలు."— అన్నాను.

"వాడికసలు ఆటలంటే వొళ్ళొంగదు."—అంది కమల. నూరుగజాల దూరంలో ఉన్న కాలేజికి, చేతిలో గొడుగు, ప్రక్కన తంబ్రి. వెనక పుస్తకాలు పట్టుకుని నౌకరు మొదలుగాగల రాజ లాంఛనాలతో "రవితేజములు" కాకపోయినా పౌండ్సుతో మెరిసి పడిపోయే ముఖంతో వెడల నడిచే కమల కాక మరెవ్వరు యోగ్యులు ఏ నౌకరు మనస్తత్వం ఏదో నిర్ణయించడానికి.

"మాకు సాయం ఉంటాడని పెట్టుకుంటే, మేమే వాడికి చేసి పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. అందుకే పొమ్మన్నాం. — అంది ఆవిడ.

పుస్తకాలు తీసుకుని, మేం ఇద్దరం నా రూంకి వచ్చేసరికి బాలయ్య కాఫీ కప్పులతో తీసుకొచ్చాడు. కమల ఎంచుకున్న పుస్తకాలు బాలయ్య చేతికిచ్చాను. నా పేరుమీద ఇష్యూ చేయించమని.

కమల కాఫీకి, పుస్తకాలకీ కృతజ్ఞత తెలియజేసి, వెళ్ళిపోయింది. నాకు బాలయ్య ప్రవర్తన కంటె ఆలోచించవలసిన ముఖ్యవిషయాలు ఉండడంచేత, మళ్ళీ బాలయ్యగురించి ఆలోచించలేదు. కాని అతను నా రూంలోకి వచ్చినప్పుడల్లా నేను గమనించకుండా ఉండలేకపోయాను - అదేదో అసంకల్ప ప్రతీకార చర్యలాగ. ఒక్కొక్కప్పుడు వాళ్ళ సెక్షన్‌కి వెళ్ళి ఏంచేస్తున్నాడో చూసేదాన్ని. ఒకరోజు పుస్తకం చదువుతూ కనిపించాడు.

"నిన్నిక్కడ వేసుకున్నది పుస్తకాలు చదవడానికి కాదు." అన్నాను కఠినంగా.

"సారీ మేడమ్." అన్నాడు బాలయ్య తల వంచుకుని. నేను కొంచెం సౌమ్యంగానేచెప్పి ఉండవలసింది. ఆ తర్వాత చాలా మార్లు సెక్షన్‌కి వెళ్ళానుకాని బాలయ్యని చదువుతుండగా ఎప్పుడూ చూడలేదు

ఇంతలో కొత్తగా గ్రాంట్సు రావడంతో పనెక్కువై బాలయ్య చదువుతున్నాడో పాడుతున్నాడో పరిశీలించే అవకాశం నాకు లేకపోయింది— మరో రెండు నెలలవరకూ.

"బాలయ్య సరిగా పనిచెయ్యడంలేదు మేడమ్" అని సెక్షన్ హెడ్ నేరారోపణ చేసేడు ఒకరోజు.

"ఏమైంది?-" అన్నాను.

"సెక్షన్‌లో నిద్రపోతున్నాడు. లేపి అడిగితే "రెండో ఆట సినిమాకి వెళ్ళాను— అంచేత నిద్ర వచ్చింది.—" అంటాడు"—

బాలయ్యని నాదగ్గరికి పంపమని చెప్పి అతనిని పంపించేశాను. బాలయ్య వచ్చేడు.

"సెక్షన్‌లో నిద్రపోతున్న మాట నిజమేనా?" ప్రశ్నించాను.

"ఒక్కసారే ఇలా తూలేనండి."—అన్నాడు.

"నువ్వు ఎలా తూలేవని నేను అడగడంలేదు నువ్వు వరసగా మ్యాటినీ నుంచి మూడాటలు



చూసినా నాకు అభ్యంతరంలేదు. కాని లైబ్రరీ అవర్స్‌లో లైబ్రరీ పనే చెయ్యాలి"— అన్నాను.

"నేను సినిమాకి వెళ్ళలేదండి.—" అన్నాడు బాలయ్య.

నాకు ఒళ్ళంత చిరాకు కలిగింది. "నాక దంతా అనవసరం. మరొకసారి వర్క్ సఫర్ అయినట్టు తేలిస్తే, నేను యాక్షన్ తీసుకోవలసి ఉంటుంది. వెళ్ళి పని చూసుకో." అన్నాను.

బాలయ్య మాటాడకుండా వెళ్ళిపోయాడు. అతను నిజంగా సినిమాకి వెళ్ళలేదేమో అనిపించింది నాకు. సెక్షన్ హెడ్ మాత్రం అప్పుడప్పుడు అతనిమీద చెబుతూనే ఉన్నాడు. నేను పిలిచి కసురుతూనే ఉన్నాను. నా దగ్గిర మాట్లాడడు. తన దగ్గరపొగరుగా జవాబులు చెబుతున్నాడని అతనంటాడు.

"నువ్వు మీ హెడ్‌కి పొగరుగా జవాబులు చెబుతావుట— ఎందుచేత?—" అని నే నెలా అడగను.

బాలయ్య తీవ్రమైన తలనొప్పి అని కలవు పెట్టాడు. "అది అబద్ధం మేడమ్. ఇవాళ క్రొత్త సినిమా మొదలు.' అన్నాడు వాళ్ళ హెడ్.

"చూడండి మిస్టర్ రామారావ్! నిత్య శంకితుడు మొదలైన అపగుడు దుఃఖభాజనులని మనకి హితోపదేశం చెబుతోంది." — అన్నాను.

"సర్లెండి మేడమ్! అనేసి అతను వెళ్ళిపోయాడు. ఆసాయంత్రం బజారులో సినిమా హాలు దగ్గిర రూపాయి టికెట్ క్యూలో చివర నిలబడిన బాలయ్యని నేను చూశాను. బాలయ్య నన్నుచూసి మొహం అటుతిప్పుకున్నాడు.

నాకు బాలయ్య మీద నమ్మకం తగింది.

మెడికల్ కాలేజి హాస్టల్ వార్డెన్‌గా ఉన్న డాక్టర్ గోపాల్ ఒకరోజు నాతో మాట్లాడడానికి వచ్చి, బాలయ్యని చూశారు. "వీడొకడొంగ" — అన్నారు.

"ఇంకొంచెం వివరంగా చెప్పండి." — అన్నాను.

వస్తుతత్త్వం ఒకటే అయినా సూదికీ, దబ్బనానికీ ఒకటే పేరు పెట్టలేం కదా!

"ఇక్కడేమి పోలేదా? " — అని ప్రశ్నించారాయన.

"నాకు తెలిసినంతవరకూ లేద"న్నాను.

"పనెలా చేస్తున్నాడు? "

ఈ శల్యపరీక్ష నాకు నచ్చలేదు. నిజానికి అతి స్వల్పమైన విషయాలు వదిలేస్తే, బాలయ్యలో ఎంచదగిన దోషాలు లేవు. చెప్పినపని చెయ్యకపోనీ కాని, తన పని కాదని కానీ ఎప్పుడూ నిరాకరించ లేదు. ఎవరైనా ఏవైనా చిన్న చిన్న పనులు చెప్తే, చిల్లర డబ్బులకి చేతులు చాపినట్టు దాఖలా లేవు.

"ఇంతకీ మీకెలా తెలుసు ఇతడిని" — అని నేనే అడిగాను. బాలయ్య ఈ ఆఫీసుకి రాక ముందు వాళ్ళ హాస్టల్లో పనిచేశాడట. కూరలు తరగడం, వడ్డించడం వంటి పనులకి కుదిరాడట. కాని కొలది దినాల్లోనే దొంగతనాలు చేస్తున్నట్టు ముందు అనుమానం కలిగి, తరువాత ప్రత్యక్ష సాక్ష్యాలతో ఋజువై, ఉద్యోగంనుండి తొలగించబడ్డాడు. బాలయ్య బియ్యం దొంగతనం చేస్తుంటే 'చూసినవాళ్ళని ఆయన కళ్ళారా చూశారట!

బాలయ్య ఆ బియ్యం ఏంచేసి ఉండేవాడో, అంతకుముందు ఏ వేం దొంగతనం చేశాడో, అవేం చేశాడో తెలియలేదు. నేనుమాత్రం ప్రిన్సిపాల్‌గారితో ఈ విషయం ప్రస్తావించి, అతడిని లైబ్రరీనుంచి మార్పించా లనుకున్నాను.

కాని ప్రిన్సిపాల్‌గారు ఒప్పుకోలేదు.

"లైబ్రరీలో బియ్యం లేవు కదండీ"— అన్నారు. వాడు పుస్తకాలు దొంగిలించదల్చుకుంటే మరొక డిపార్ట్‌మెంటులో ఉంటే మాత్రం చెయ్యలేడా అని వితర్కించేరు. అంతేగాక దొంగకి బాధ్యత లప్పజెప్పడంలో గొప్ప స్వారస్యం ఉందని నాకు బుద్ధి చెప్పారు. నాకు విసుగేసి ఊరుకున్నాను. కాని బాలయ్యని కనిపెట్టి చూడమని అసిస్టెంటుతో మాత్రం చెప్పలేదు.

బాలయ్యని మార్చి నారూం దగ్గిర వేసుకున్నాను. నేను ఏ పని చెప్పినా వెంటనే చేసే

# తృష్ణ

వాడు. ఒక్కొక్క మారు నాకు ఆశ్చర్యం వేసేది. అతడు సాధించిన ఘనకార్యాలు చూస్తే. ఊళ్ళో ఒక్క చుక్క కిరసనాయిలు దొరకడం లేదని. పెద్ద డాక్టరు, సబ్ జడ్జీ అనుకున్న పరపతినంతా వినియోగించి తంటాలు పడుతున్న రోజుల్లో బాలయ్య టిన్ తెచ్చి ఇంట్లో పెట్టాడు. పంచదార, బియ్యం, రైళ్ళలో రిజర్వేషను, తాలూకాఫీసులో పెర్మిట్లు — ఏవైనా నిముషాల మీద సాధించుకొచ్చేవాడు. కాని నా దగ్గిరికి ఏ పుస్తకం కోసమో వచ్చే పురప్రముఖుల వల్ల అతన్ని గురించి నేను విన్నవి మాత్రం ఏమంత ఆనంద దాయకమైనవి కావు.

"ఏనంటే నిర్లక్ష్యం — వాడికి" — అన్నారొకరు.

"దొంగ వెధవ" అని మరొకరు సర్టిఫై చేశారు.

"ఒంటి పక్షి. సత్రం భోజనం మఠం నిద్రా. డబ్బు విషయంలో జాగ్రత్త." — అని వేరొకరు హెచ్చరించారు.

"చాలా వినయంగా ఉంటాడే" అని నేనంటే కారణము లేక నూకలు చల్లబడవుగదా?— అని పాత కథ జ్ఞప్తికి తెచ్చారు. ఒక్కటి మాత్రం నిజం. బాలయ్య ఎప్పుడూ నా దగ్గిర ప్రతిఫలం ఆశించలేదు. సరికదా నేను యిస్తానన్నా పుచ్చుకోలేదు.

ఎండాకాలం శెలవులు ప్రారంభమయాయి. పిల్లలంతా ఇళ్ళకి వెళ్ళిపోయారు. నేను కాలేజీకి వచ్చి రెండేళ్ళవుతోంది. ఇంత వరకూ స్టాక్ వెరిఫికేషన్ చెయ్యలేదు. ఇప్పుడు చెయ్యమని స్టాఫ్‌తో చెప్పి. దానికి కావలసిన ఏర్పాట్లు చేసి, మావూరికి వెళ్ళిపోయాను పది హేను రోజులు శెలవు మీద.

తిరిగి వచ్చే సరికి బాలయ్య సస్పెన్షన్‌లో ఉన్నాడని తెలిసింది. "ఎందుచేత?" — అన్నాను తెల్లబోయి. వెరిఫికేషన్ పూర్తి అయింది. ఇరవై అయిదు పుస్తకాలు కనిపించడం లేదు. నేను వచ్చి రిపోర్ట్ సబ్మిట్ చేసేవరకూ. బాలయ్యని ఆఫీసుకి రావొద్దని ప్రిన్సిపాల్ గారు ఆదేశించారుట.

నేను వచ్చిన తర్వాత బాలయ్య నాకు ఇంటి దగ్గిరకాని ఆఫీసు దగ్గిరకాని కనిపించలేదు. ఒకళ్ళిద్దరు ప్యూన్స్‌ని అడిగాను— బాలయ్య ఎక్కడ ఉన్నాడో పిలుచుకు రమ్మని. వాళ్ళు తెలీదన్నారు. ఈ మధ్య ఎక్కడా కనిపించలేదుట.



"ప్రసాదానికి ప్రయత్నము"

చిత్రం : మారేమండ శ్రీనివాసరావు గుంటూరు-2

బాలయ్య ఇరవై అయిదు పుస్తకాలు దొంగిలించాడంటే నమ్మలేక పోయాను. కాని అతడే కనిపించకుండా పోయినప్పుడు నేనేం చెయ్యగలను?

నా విధి ప్రకారం పోయాయనుకున్న పుస్తకాల లిస్టు తీసుకుని. మళ్ళీ జాగ్రత్తగా వెతికించాను. పది పుస్తకాలు కనుక్కోగలిగాం. అవికాక ప్రిన్సిపాలుగారు, కాలేజీకరెస్పాండెంటు, కమిటీ మెంబర్లు ఫలానా పుస్తకం పంపించమని చిన్న చిన్న కాగితపుముక్కలమీద వ్రాసి పంపిన అనామత్ లెఖ్ఖలలో ఎనిమిది తేలేయి. అందులో నాలుగేళ్ళుగా వాళ్ళ దగ్గిరే ఉండిపోయినవి ఉన్నాయి. ఇవన్నీ తేలేసరికి మరొక రెండు వారాలు గడిచిపోయేయి.

బాలయ్య మాత్రం అయిపులేడు. నా రిపోర్టు వ్రాసి ప్రిన్సిపాల్‌గారి సముఖానికి సమర్పించుకున్నాను. ఏడు పుస్తకాలకి జాడ తెలియటం లేదు. కాలేజీ కమిటీ వారు బాలయ్యమీద పోలీస్ రిపోర్ట్ ఇవ్వడానికి నిర్ణయించేరని తెలిసినప్పుడు నా గుండెల్లో కలుక్కుమంది. ఆ కమిటీలో లైబ్రరీ పుస్తకం తీసుకుని సంవత్సరాలు తరబడి తిరిగి ఇవ్వని వాళ్ళున్నారు. నేనూ, బాలయ్యా చేరకముందు, స్టాక్ వెరిఫికేషన్ చేసి ఎన్నాళ్ళయిందో తెలీదు. కాని ఇటువంటి ఆలోచనా విధానం ఆఫీసర్ల ఆరోగ్యానికి మంచిది కాదు.

పోలీస్ రిపోర్ట్ యిచ్చేరు. పోలీసులు బాలయ్య నివసించే పాక కనుక్కున్నారు. అది ఆరుమైళ్ళ దూరంలో ఉన్న చిన్న పల్లెలో ఒక మారుమూల పాక. సబ్ఇన్‌స్పెక్టరు నన్నూ, ప్రిన్సిపాల్ గారిని అక్కడికి తీసుకువెళ్ళారు— మా వస్తువులు గుర్తించడానికి.

ద్వారం దగ్గిర చేరవేసి ఉన్న తడిక ఒక్క తోపుతో పడిపోయింది. ఆ చుట్టు గుడిసెలో కనిపించిన వస్తువులు చాలా తక్కువ. వదులుగా కట్టిన తాడుమీద ఒకపాత లుంగీ, ఒకషర్టు, ఒక పాంటూ వ్రేలాడుతున్నాయి. ఒకమూల వారగా ఒక మట్టి కూజా, జర్మన్ సిల్వర్ గ్లాసూ ఉన్నాయి. తలుపు వేపుకి కొన్ని పుస్తకాలు, ఒక కిరసనాయిలు దీపం, ఒక పెన్ను ఉన్నాయి.

"ఆ బుక్సు చూడండి."—అన్నారు యస్. ఐ.

నాకు ఎందుకో గొంతుకలో చెమ్మగా ఉంది. యస్. ఐ. ప్రిన్సిపాల్‌గారికి వివరిస్తున్నారు తన జీవితంలో "ఇలాంటి" వ్యాపారాలు చేసేవారిని ఎంత మందిని చూశారో, ఎలా కనిపెట్టారో...

నేను ఒక్కొక్క పుస్తకం తీసి చూస్తున్నాను. వార్ ఎండ్ పీస్, క్రైం అండ్ పనిష్మెంట్, కృష్ణ పక్షం, గోన గన్నారెడ్డి, అల్లో నేరేడు, కృష్ణాతీరం, — బాలయ్య ఈ పుస్తకాలు ఎలా సేకరించినా, అన్నీ మంచివే చేసినందుకు — అతని అభిరుచిని మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. నాకు రిలీఫ్ ఇచ్చిన మరొకవిషయం— అవేవీ మా లైబ్రరీకి సంబంధించినవి కాకపోవడం. వాటి పక్కనే ఉన్న నోటుబుక్సుతీశాను— అందులో తెలుగులోనూ ఇంగ్లీషులోనూ వ్రాసి

ఉన్నాయి. అవన్నీ వివిధ గ్రంథాలలోంచి తీ సి. వ్రాసుకున్న సుభాషితాలు.

"అయిదు రేకుల దీపకళిక నార్పజూచెదరెవరు? తారకా నవశైల బిందువు లారవిచ్చునె బ్రతుకు దివ్వెను!"

"వ్రాతవ్రాసెడు హస్తమువ్రాసి కదలి వ్రాయుచును పోవుచుండ ఆ వ్రాతలోని పంక్తి సగమైన మరి రద్దు పరచలేవు."

"కన్నె ఎవరో చనిపోయి. మన్నుకాగ పూచి నది సుమ్ము ఆ మల్లెపువ్వు సొగసు!"

— అవి చూస్తున్నకొద్దీ నాకు సంభ్రమం కలుగసాగింది? బాలయ్య ఇంతటి సాహితీ పరుడా? ఇవి బాలయ్యవేనా?

"యస్ మేడమ్?–" యస్ ఐ. పిలిచారు.

"ఆఁ– అంటూ," ఆ నోట్ బుక్సు వదిలేసి మరొక పుస్తకం తీశాను. అది వేయి పడగలు. లోపలి పేజీతీసి చూశాను. కళ్ళు చెదిరినట్టని పించింది. మా కాలేజీస్టాంపు దానిమీద వుంది. దాన్ని అరువుగా తెచ్చిన గుర్తులేమీ లేవు. కొంత భాగం చదివిన గుర్తుగా ఒక కాగితపు ముక్క ఉంది. ఒకచోట.

"ఇదిమాత్రం మా లైబ్రరీదే." — అన్నాను అక్కడ్నుంచి లేస్తూ.

ఏది జరక్కుండా ఉంటే బాగుండుననుకున్నానో అదే జరిగింది. నా మనసు చికాకుగా ఉంది. ఆ చుట్టుపక్కల ఎక్కడో పందిని పట్టుకుంటున్నారు కాబోలు అది హృదయ విదారకంగా అరుస్తోంది.

"ఈ పరిసరాలు నేను భరించలేను. త్వరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం." అన్నాను ప్రిన్సిపాల్‌తో.

ఇంటి కొచ్చిన రెండుమూడు రోజులవరకూ ఏ పనీ చెయ్యలేక పోయాను. ఆలోచిస్తున్న కొద్దీ నాకు మరొక విషయం తట్టసాగింది. ఒకటి రెండుసార్లు నేను కావాలనుకున్న పుస్తకాలు షెల్ఫులో లేవు. లోన్‌లోనూ లేవు. అప్పుడు ఎంత వెతికినా దొరకని ఆ పుస్తకాలు ఆ తర్వాత దొరికేయి. అవి మళ్ళీ ఎలా వచ్చేయంటె, ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదు. ఆ పుస్తకాల్లోని వాక్యాలు బాలయ్య నోట్సులో ఉన్నాయి. మరొకవిచిత్రం పోయాయనుకుంటున్న పుస్తకాల లిస్టులో వేయి పడగలు లేదు! అయితే బాలయ్య పుస్తకాలు దొంగతనంగా తీసుకునివెళ్ళి చదివి. మళ్ళీఅక్కడ పెట్టేస్తుండాలి. నమ్మదగ్గ కథగా లేదు. కాగా బాలయ్య అంతటి చదువరీ. సంస్కారీనా? - అని మరొకప్రశ్న.

బాలయ్య పోలీసులకి దొరకలేదు. కాలేజీ కమిటీవారు బాలయ్యే అన్నిపుస్తకాలూ దొంగిలించినట్లు నిర్ణయించి. అతడికి ఆ నెలలో ఇవ్వవలసిన జీతం పట్టుకునేటట్టు, ఉద్యోగంలోంచి బర్తరఫ్‌చేసినట్టు, పోయిన పుస్తకాలు రైటాఫ్ చేసేట్టు ఉత్తర్వు జారీ చేశారు.

అతని దగ్గిరున్న పుస్తకాలు, వ్రాసుకున సుభాషితాలు జ్ఞాపకం వచ్చినపుడు అనిపించేది– తగిన అవకాశం, సవ్యమైన గురుత్వం ఉండి ఉంటే బాలయ్య పండితుడై ఉండేవాడేమోనని

బాలయ్య చరిత్రలో కలిసిపోయాడనే అనుకున్నాను — మూడేళ్ళనాడు మద్రాసులో మూర్ మార్కెట్‌లో కొన్ని అలభ్య గ్రంథాలు వెతుకుతున్న నాకు బాలయ్య కనిపించేవరకూ.

అతడే నన్ను ముందు గుర్తుపట్టి, ఇంగ్లీషూ, తెలుగూ కాని ఒక మధ్యస్థమైన పద్ధతిలో చేయి ఎత్తి "నమస్తే మేడమ్" అన్నాడు.

ఏనాడో తప్పిపోయిన తమ్ముడు దొరికినంత సంతోషం కలిగింది నాకు. క్షణంపాటు ఏం మాట్లాడడానికి తోచలేదు.

"బాగున్నావా?"– అన్నాను.

"బాగున్నానండీ." అన్నాడు బాలయ్య. అల్లంత దూరంలో ఉన్న సెకండ్ హాండ్ పుస్తకాల షాపు చూపించాడు, తనదేనని

నా సంతోషం తల్లడిల్లిపోయింది ఆ నాడు సబ్‌ఇన్స్‌పెక్టర్ అన్నమాట జ్ఞాపకం వచ్చింది.

"రండి మేడమ్, నా షాపు చూడండి–"అని ఉత్సాహంగా పిలుస్తున్నాడు, ఆలోచిస్తూ అతన్నను సరించాను. ఒక్కొక్క పుస్తకం తీసిచూస్తున్నాను చాలా మంచి పుస్తకాలున్నాయి. ధర అడిగితే నవ్వి "తీసుకోండి, మేడమ్" అన్నాడు. ఆఖరికి వెయ్యకూడదనుకున్న ప్రశ్న వెయ్యకుండా ఉండలేకపోయాను.

"నీకు ఈ పుస్తకాలు ఎలా వస్తాయి?"

బాలయ్య అన్నాడు — "దొంగతనం చేసినవి మాత్రం కాదండీ—" ఛెళ్ళున మొహాన కొట్టినట్టనిపించింది. "అది కాదోయ్—" అంటూ చెప్పబోయాను.

"క్షమించండి మేడం అక్కడ కాలేజీలో జరిగిన సంగతులన్నీ నాకు తెలుసు. మీ రందరూ అనుకున్నట్టు నేను ఏడు పుస్తకాలు దొంగతనం చెయ్యలేదు. ఒక్క "వేయి పడగలు" మాత్రం– అదికూడా నిర్దుష్టంగా చెప్పాలంటే రహస్యంగా లైబ్రరీనుంచి తెచ్చుకున్నాను కాని దొంగిలించలేదు. ఇతర పుస్తకాలలాగే అదికూడా చదివి లైబ్రరీలో పెట్టేసి ఉండేవాడిని. అదికూడా మాలాటి నాలుగో తరగతి ఉద్యోగులకి గత్యంతరం లేదుకనక, నాకు చిన్నప్పట్నుంచి చదవాలనే కాంక్ష. కమలమ్మగారింట్లో పని చేస్తున్నప్పుడు మావూరికి కొత్తగా బ్రాంచి లైబ్రరీ వచ్చింది. ఆవిడ చెప్పారుకదా నేను ఉదయం, సాయంత్రం కనిపించేవాడిని కానని, లైబ్రరీకి వెళ్ళేవాడిని. పనంతా చేసినా, ఇంట్లో కనిపించకపోవడమే నేరంగా వాళ్ళు చిరాకుపడసాగారు. ఆ తర్వాత చాలా ఉద్యోగాలు చేశాననుకోండి. మెడికల్ కాలేజీ హాస్టల్‌లోమాత్రం నేనే మానేశాను — లైబ్రరీలో అయితే చదువుకోవచ్చు అనుకుని..." బాలయ్య ఆగాడు.

"కానీ నేను ఒప్పుకోలేదు." — అన్నాను ..ందిస్తున్నట్టు.

బాలయ్య సిగ్గుపడ్డాడు — "మీరన్నమాట కూడా నిజమే కదండీ నన్ను జీతంఇచ్చి పెట్టుకున్నది నేను చదువుకోడానికి కాదుకదా. అయితే నేను చదువుకోవాలంటె, ఫలానాపుస్తకం ఇప్పించమని ఎవరైనా అడిగితే, అది కాశమ్మ కథలకి మించిన పుస్తకంఅయితే, వాళ్లు అదోలా చూసి– "నువ్వారు — ఇదా? — చదువుతావా?" — అంటారు."

అందుకని బాలయ్య ఈ పద్ధతి కనిపెట్టేడు. కాని అది ఎక్కువరోజులు సాగలేదు. అందుకని మద్రాసువచ్చి కష్టపడి సెకండ్‌హాండ్ పుస్తకాల షాపులో బాయ్‌గాచేరి. క్రమంగా భాగస్థుడై ఆఖరికి సొంతదుకాణం పెట్టుకునే స్థితికివచ్చేడు. చాలా సంతోషించదగ్గ విషయం.

"ఇప్పుడు ఎన్నైనా చదువుకోవచ్చు ఎవరూ అడగరు." — అన్నాను వెనక్కి తిరగబోతూ.

బాలయ్య నవ్వేడు "అదేనండీ తమాషా. ఇప్పుడు పుస్తకాలు నాకు వ్యాపారం సరుకు మాత్రమే. మిఠాయి దుకాణదారులా చుట్టూ పరుచుకుని కూర్చుంటానంతే "చదివే తీరిక లేదు."



డిజైన్

కంచి నాగేంద్రకుమార్, విజయవాడ 1